పేదలకు స్వగృహమస్తు

సైదాపురం/వెంకటగిరిరూరల్: పట్టణానికి సమీపంలో నిర్మించిన టిడ్కో గృహాల ప్రారంభోత్సవం సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. దీంతో పేదలకు సొంతింటి స్వప్నం సాకారమైంది. తొలుత ఎస్టీపీ కర్మాగారం, జగన్న టిడ్కో కాలనీ శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం వేద మంత్రోచ్చారణాల నడుమ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి గృహాలను ప్రారంభించారు. లబ్ధిదారుల నివాసంలోకి చేరుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నేతలు లబ్ధిదారులకు టిడ్కో గృహాల ఉచిత రిజిస్ట్రేషన్ పత్రాలతోపాటు, నూతన దుస్తులు అందజేశారు. అనంతరం పొంగళ్లు పెట్టి, నూతన గృహ ప్రవేశాలు చేశారు. థ్యాంకు సీఎం సార్ అంటూ టిడ్కో గృహాలు అందుకున్న లబ్ధిదారులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రూ.20 లక్షలు కూడిన టిడ్కో ఇళ్లను ఉచితంగా పేదలకు ఇవ్వడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. త్వరలో 500 గృహాల నిర్మాణ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. టిడ్కో గృహాలకు విద్యుత్ సర్వీసు కనెక్షన్ల కోసం తమ సొంత నిధులను వెచ్చించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ మాట్లాడుతూ జన జాతరను తలపించేలా టిడ్కో గృహప్రవేశాలు జరగడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. నవరత్నాలు 9 కాదని, 25 సంక్షేమ పథకాలు అని చెప్పారు. పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అందరూ ఆశీర్వదించాలని కోరారు. వెంకటగిరి రాజా కుటుంబీకుడు సర్వజ్ఞ కుమార యాచేంద్ర మాట్లాడుతూ ఈ రోజు ఎంతో ఆనందంగా ఉందన్నారు. టిప్పుసుల్తాన్ వెంకటగిరి కోటను ధ్వంసం చేసిన తరువాత పునర్నిర్మాణం ఎలా జరిగిందో, ప్రస్తుతం టిడ్కో గృహాలతో వెంకటగిరి మరో పట్టణంగా సంతరించుకుంటుందన్నారు. గత ప్రభుత్వంలో చేనేత కుటుంబాలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఒక్కొక్క చేనేత కుటుంబానికి ఏటా రూ.24 వేల నగదును అందజేస్తున్నారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్ భానుప్రియ మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా చెప్పిన దానికంటే అధికంగా పథకాలు అమలు చేసి, ప్రజల వద్దకే పాలన తెచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎస్ సురేష్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు డీ రాధ, ఎం జానకిరామయ్య, నారాయణ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి







వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మేరిగ మురళీధర్, టిడ్కో చైర్మన్ ప్రసన్న తదితరులు, టిడ్కో లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేస్తున్న డిప్యూటీ సీఎం, టిడ్కో గృహాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, టిడ్కో చైర్మన్

పెద్దిరెడ్డితో మేరిగ భేటీ



మంత్రికి పుష్ప గుచ్ఛం అందజేస్తున్న మేరిగ మురళీధర్

గూడూరురూరల్: నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ సోమవారం తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం గూడూరు నియోజకవర్గంలోని కోటలో జరిగిన సామాజిక సాధికార యాత్రకు సంబంధించిన విషయాలను ఆయనతో చర్చించారు. అలాగే గూడూరు నియోజకవర్గంలోని సమీకరణాలు, విజయావకాశాలు, పార్టీ పరిస్థితిపై మంత్రి అడిగి తెలుసుకున్నారు. అందరిని కలుపుకుని పార్టీ విజయానికి కృషి చేయాలని మంత్రి సూచించారు.

ఆసరా చెక్కుల పంపిణీ నేడు

సైదాపురం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీఎం రాధారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. మహిళలు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఏపీఎం పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

కండలేరులో 12.058 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 12.058 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 160 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 360 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



గ్యాస్ కనెక్షన్ పంపిణీ చేస్తున్న హరనాథ్‌రెడ్డి

ఓజిలి: మండలంలోని మానమాలలో పీఎం ఉజ్వల యోజన పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు 12 నూతన గ్యాస్ కనెక్షన్లను ఉప సర్పంచ్ హరనాథ్‌రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఓజిలి ఆర్‌ఆర్ హెచ్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మహిళలకు 12 గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. గ్యాస్ కనెక్షన్లు లేని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అధ్యాపకులకు శిక్షణ

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో సోమవారం వాద్వానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంప్లాయిబులిటీ స్కిల్స్ అనే అంశంపై అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ మాస్టర్ ట్రైనర్ స్వాతిపుత్రన్ మాట్లాడుతూ విద్యార్థులకు కావాల్సిన ఉద్యోగ నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు అవసరమైన శిక్షణను అధ్యాపకులకు అందిస్తున్నట్లు తెలిపారు. నాలుగురోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న అధ్యాపకులకు గ్లోబల్ సర్టిఫికెట్ అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, కిషంధర్, ఇందుమతి పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

గూడూరు రూరల్: పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే కండలేరు డ్యామ్ వద్ద 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా మంగళవారం పట్టణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని సోమవారం మున్సిపల్ డీఈ శ్రీనివాసమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్న కారణంగా పట్టణ ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని కోరారు.

వైభవంగా గ్రామోత్సవం



గొబ్బెమ్మను ఊరేగిస్తున్న మహిళలు

రాపూరు: మండల కేంద్రంలోని తూర్పుఅగ్రహారంలో ఏర్పాటు చేసిన గొబ్బెమ్మకు సోమవారం ప్రత్యేక పూజలు చేసి, గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గొబ్బెమ్మను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీర్చి విశేషాలంకరణ చేసి, ఊరేగించారు. తప్పెట్లు, తాళాల నడుమ మహిళలు గొబ్బెమ్మను పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ తీసుకువెళ్లి పెద్దచెరువులో నిమజ్జనం చేశారు.


4న మండల మీట్

రాపూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఫిబ్రవరి 4వ తేదీన ఎంపీపీ ప్రసన్న అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అప్పాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

దొరవారిసత్రం: నెలబల్లిలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం జరుగుతుందని ఎంపీడీఓ రఘురామయ్య తెలిపారు. సురక్ష కార్యక్రమంలో సాధారణ వచ్చే వ్యాధులతో పాటు దీర్ఘకాలిక జబ్బులకు కూడా వైద్యులు పరీక్షలు చేసి, మందులు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే కంటి పరీక్షలు కూడా చేసి దృష్టి లోపం ఉన్న వారికి కంటి అద్దాలను పంపిణీ చేస్తారన్నారు.

ఆగమోక్తంగా సంకట చతుర్దశి పూజలు



హోమం చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజి అంజి వినాయకస్వామి ఆలయం వద్ద సోమవారం ఆగమోక్తంగా సంకట చతుర్దశి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకం చేసి, విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

వెంకటగిరి రూరల్: ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికాభివృద్ధి సాధించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్ భానుప్రియ అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో నడుపుతున్న పట్టణ ప్రగతి యూనిట్ (క్లాత్ బ్యాగ్‌ల తయారీ కేంద్రం)ను సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదుపు మహిళలు ఇదే స్ఫూర్తితో ముందుకు నడవాలని కోరారు. స్వయం ఉపాధితో కుటుంబం అభివృద్ధి చెందడమే కాక, మరి కొందరికి ఉపాధి కల్పించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు పి లక్ష్మి, రాధమ్మ, ప్రభావతి, కళ్యాణి, ఎం రమణమ్మ, మెప్మా సిబ్బంది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



క్లాత్‌బ్యాగులను తయారీని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భానుప్రియ

ఎస్టీలకు సాగు భూములివ్వాలి

డక్కిలి: తమకు సాగు భూములివ్వాలని మండలంలోని మోపూరురోడ్డు సెంటర్ ఎస్టీ కాలనీ వాసులు ఏపీ ప్రజా సంఘాల అధ్యక్షుడు గద్దల మునెయ్య ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోపూరు సర్వే నెంబర్ 1లో ఉన్న ప్రభుత్వ భూమిని ఎస్టీలకు అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కుల కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు చిరంజీవి, వెంకటాద్రి, వెంకటేశ్వర్లు, చెంగయ్య, ఏపీ ప్రజా సంఘాల ఐక్య వేదిక వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్‌కే రఫీ, మండలశాఖ అధ్యక్షుడు కే శీనయ్య, చెంచు కృష్ణ పాల్గొన్నారు.



తహసీల్దార్‌తో చర్చిస్తున్న ప్రజా సంఘాల నేతలు

తెలుగు గంగ నీటిని విడుదల చేయాలి

చిల్లకూరు: మండలంలోని నాంచారమ్మపేట గ్రామానికి చెందిన సన్నకారు రైతులు సోమవారం తెలుగుగంగ అధికారులను కలసి గంగ నీటిని చెరువుకు విడుదల చేసి, చివరి తడులకు నీరు అందించాలని కోరారు. ఈ సందర్భంగా నాంచారమ్మపేట గ్రామానికి చెందిన సన్నకారు రైతులు మాట్లాడుతూ గ్రామంలోని రైతులకు గూడూరు మండలం పోటుపాళేనికి చెందిన చెరువు కింద సుమారు 50 ఎకరాల వరకు భూములు ఉన్నాయన్నారు. ఈ ఏడాది భారీ వర్షాలు కురిసినప్పటికీ ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన నీటిని చెరువులో నుంచి పూర్తిగా విడుదల చేశారని, దీంతో వర్షాలు ఆగిన తరువాత చెరువులో ఉన్న నీరు అడుగంటి పోయిందని, దీంతో ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ఈ క్రమంలో తెలుగు గంగ నీటిని విడుదల చేస్తే సాగు చేసిన వరి పూర్తి స్థాయిలో దిగుబడి వచ్చే వీలుంటుందని తెలిపారు. దీనిపై స్పందించిన తెలుగు గంగ ఈఈ శ్రీనివాసరావు త్వరలో నీటిని విడుదల చేసేలా చర్యలు చేపడతామని తెలిపారు.



ఈఈకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పత్రాలు తప్పనిసరి

రాపూరు: వాహన చోదకులు వాహనాలకు సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా ఉండాలని సీఐ సుబ్రమణ్యం అన్నారు. స్థానిక మద్దెలమడుగు సెంటర్‌లో సోమవారం పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన చోదకుడికి డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు ఆర్సీ, వాహనంలో తరలించే వస్తువులకు బిల్లులు, ప్రభుత్వానికి చెల్లించిన రుసుము తదితర పత్రాలు సక్రమంగా ఉండాలన్నారు. ఎన్నికల సమయం రావడంతో వాహనాల్లో నగదు రవాణా చేయకూడదని, అలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామమన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ సుబ్రమణ్యం

పల్లె పల్లెకు ఏడీపీఎస్

డక్కిలి: పల్లె పల్లెకు ఏడీపీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సిద్ధాంత ప్రచారం–బౌద్ధ మత వ్యాప్తి అంబేడ్కర్ ధర్మ పోరాట సమితి లక్ష్యం అని ఏడీపీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జే వెంకటయ్య తెలిపారు. వెంబులూరు పంచాయతీలోని అంబేడ్కర్ నగర్‌లో సోమవారం ఏడీపీఎస్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో పల్లెపల్లెకు ఏడీపీఎస్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడీపీఎస్ నెల్లూరు జిల్లా కార్యవర్గ సభ్యుడు జీ గోపాల్, వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు తనిఖీ



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ

దొరవారిసత్రం: సూరపుఅగ్రహారం గ్రామం, ఎస్సీ కాలనీల్లోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ కృష్ణయ్య సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం జగనన్న గోరుముద్ద నిర్వహణను తనిఖీ చేసి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలల్లోని రికార్డులను పరిశీలించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సకాలంలో విధులకు హాజరుకావడంతోపాటు సకాలంలో పాఠ్యాంశాలను పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు ఎంఈఓ సూచించారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

డక్కిలి: చదవులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని కమ్మపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.

కోట క్రీడాకారుల ప్రతిభ



క్రికెట్ క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీడీఓ

కోట: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో కోట క్రీడాకారులు ప్రతిభ కనబరిచినట్లు ఎంపీడీఓ భవానీ తెలిపారు. సోమవారం ఆమె నియోజకవర్గస్థాయి పోటీల్లో విజేత జట్టును ఆమె అభినందించారు. గూడూరులో జరిగిన పోటీల్లో కోట మండలం మహిళల జట్టు కబడ్డీ, ఖోఖో, క్రికెట్‌లో విజేతగా నిలిచింది. షటిల్ బ్యాడ్మింటన్‌లో మూడోస్థానం దక్కించుకున్నట్లు తెలిపారు. పురుషుల జట్టు కబడ్డీ, క్రికెట్‌లో రన్నర్స్‌గా నిలిచినట్లు తెలిపారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఈ నెల 31 నుంచి తిరుపతిలో జరిగే జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పీఈటీలు సందానీ, వలీఅహ్మద్, కరిముల్లాను ఎంపీడీఓ అభినందించారు.



షటిల్ ఆటగాళ్లను అభినందిస్తున్న భవాని

కులగణన త్వరగా పూర్తి చేయాలి

చిల్లకూరు: కులగణన స్వర్వే త్వరితగతిన పూర్తి చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ వెంకటసూర్యసాయి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులగణన కార్యక్రమాన్ని రెండు రోజుల్లో పూర్తి చేసేలా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది చొరవ చూపాలన్నారు. కొన్ని సచివాలయాల పరిధిలో సర్వర్లు పని చేయడం లేదని, కొంత మంది ఆలస్యం చేస్తున్నారని, దీన్ని ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించేది లేదన్నారు. అలాగే 15 వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు విషయంలో కూడా కొన్ని పంచాయతీలు అలసత్వం పాటిస్తున్నాయని, త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్నందున అటు తరువాత చేసిన పనులకు నిధులు విడుదల కావని, త్వరగా పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ సమీక్షలో ఈఓపీఆర్‌డీ మాణిక్యం పాల్గొన్నారు.



కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ వెంకటసూర్య సాయి

న్యాయం చేయండి

నాయుడుపేట: మండలంలోని వెంగమాంబపురం గ్రామానికి చెందిన గిరిజనుల పొలాలు కబ్జా చేసి ఆక్రమించుకుంటున్న పుల్లా హరికృష్ణపై చర్యలు తీసుకోవాలని గిరిజనులు తహసీల్దార్ రాజేంద్రకు వినతిపత్రం అందజేశారు. వెంగమాంబపురం గిరిజన కాలనీలోని ఎం సుమతితోపాటు మరో తొమ్మిదిమందికి చెందిన గిరిజనులకు సర్వే నంబర్ 3లో 50 సెంట్లు వంతున గతంలో ప్రభుత్వం పొలం ఇచ్చిందన్నారు. అయితే పుల్లా హరికృష్ణ, తమ పొలాని లాక్కుని సాగు చేసేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి మా భూమిని తమకు ఇప్పించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటానని బాధితులకు భరోసా ఇచ్చారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గిరిజనులు

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

గూడూరురూరల్: వాహన చోదకులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ఎంవీఐ సునీల్ సూచించారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం గూడూరు పట్టణంలో మినీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వయస్సు పైబడిన వాహన చోదకులు కంటి పరీక్షలు చేయించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహన చోదకులు ప్రతి మూడు నెలలకొకసారి కంటి పరీక్షలతోపాటుగా ఆరోగ్య పరీక్షలు కూడా చేయించుకుంటే వాహనాలు నడిపే సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. అతి వేగం ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు. అనంతరం డ్రైవర్లు, క్లీనర్లు, రవాణాశాఖ సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు.



డ్రైవర్లకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

క్రీడాభివృద్ధికి సీఎం జగనన్న కృషి

వెంకటగిరి రూరల్: రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వెంకటగిరిలో జరిగిన నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచిన జట్లకు ప్రోత్సాహక నగదు బహుమతితో పాటు, షీల్డ్‌ను అందజేసి, అభినందించారు. నియోజకవర్గస్థాయి పోటీల్లో 80 జట్లు తలపడగా 10 జట్లు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌చైర్‌పర్సన్ ఎస్ భానుప్రియ, పట్టణకన్వీనర్ జీ ఢిల్లీబాబు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు, జిల్లా సంయుక్త సహాయకార్యదర్శి సీ హరికృష్ణ, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, విప్ పి లక్ష్మి, కౌన్సిలర్లు డీ రాధ, కే కళ్యాణి, ఎంఎ నారాయణ, శంకరయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు దేవికాచౌదరి, రామతులసి, సీహెచ్ గాయత్రి, ప్రత్యేక అధికారి నాగార్జునసాగర్, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

డక్కిలి: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు తాను అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఇటీవల టీడీపీ శ్రేణులు దాడిలో గాయపడిన దేవునివెల్లంపల్లిలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలకృష్ణ కుటుంబ సభ్యులను సోమవారం ఆయన పరామర్శించారు. అనంతరం డక్కిలి మండలం చాపలపల్లెకు చెందిన ఎంపీపీ గోను రాజశేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో ఆయన్ని కూడా నేదురుమల్లి పరామర్శించారు. ఆయన వెంట జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పీ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు ఎన్ సురేష్‌రెడ్డి, సర్పంచ్ సీ సుజాత, పీఏసీఎస్ అధ్యక్షులు పీ దశరథరామిరెడ్డి, ఘట్టమనేని శ్రీనివాసులు నాయుడు, నాయకులు డీ రవీంద్రారెడ్డి, ఎం నారాయణరెడ్డి, కృష్ణ, నాభూషణరెడ్డి, శ్రీహరిరెడ్డి, మల్లి, చిరంజీవి, మల్లిరెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు

రాపూరు: ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన వారికి బహుమతులు అందించినట్లు డిపో మేనేజర్ అనిల్ కుమార్ తెలిపారు. ఆర్టీసీ నిర్వహిస్తున్న లక్కీడిప్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పలు మార్గాలకు సంబంధించి డిప్ తీసి, విజేతలను ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ రాపూరు –గూడూరు, రాపూరు–వెంకటగిరి మార్గాల్లో ప్రయాణించే ప్రయాణికులు బస్సు దిగే సమయంలో తమ టికెట్ పై ఫోన్ నంబర్, ఊరు పేరు రాసి బస్సులో ఏర్పాటు చేసిన బాక్స్‌లో ఆ టికెట్ వేస్తే ప్రతి 15 రోజులకు ఒక లక్కీడిప్ ద్వారా ఆరుగురిని ఎంపిక చేసి బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఐ బషీర్‌అహ్మద్, డీసీ రహమాన్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న డీఎం

రూ 5 లక్షల నగదు స్వాధీనం

చిల్లకూరు: ఎన్నికల నేపథ్యంలో సోమవారం రాత్రి చేపట్టిన వాహన తనిఖీల్లో రూ. 5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. చిల్లకూరు పోలీసులు బూదనం టోల్‌ప్లాజా వద్ద తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అటు వైపు వచ్చిన కారును తనిఖీ చేశారు. ఆ కారులో రూ.5 లక్షలు ఉండగా గుర్తించారు. నెల్లూరు జిల్లా కొండాపురం ప్రాంతానికి చెందిన నరసింహారెడ్డి అనే వ్యక్తి ఎలాంటి పత్రాలు లేకుండా రూ.5 లక్షల నగదుతో నాయుడుపేట వైపు వెళుతున్నట్లు గుర్తించారు. దీంతో ఆ నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. ఆ నగదును ఆదాయపన్ను శాఖకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.